చేతి వృత్తిదారులకు రుణ సదుపాయం

పార్వతీపురం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనార్టీ చేతి వృత్తిదారులకు పీఎం విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ మెహబూబ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 రకాల వృత్తి పనిచేసుకునేవారు ఈ పథకానికి అర్హులన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంవీఐఎస్‌హెచ్ డబ్ల్యూఏకేఏఆర్ఎంఏ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణపత్రం, బ్యాంకు పాస్‌బుక్ ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం విజయనగరంలో తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

కర్మాండూలో మనోళ్లు!



కర్మాండూలో చిక్కుకుపోయిన జిల్లా వాసుల వివరాలు సేకరిస్తున్న అక్కడి అధికారులు

- తీర్థయాత్రలకని వెళ్లి చిక్కుకున్న జిల్లావాసులు
- ఫోన్‌లో ధైర్యం చెప్పిన మంత్రి నారా లోకేశ్
- సురక్షితంగా జిల్లాకు తెప్పించేందుకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సుమారు 40 మంది నేపాల్‌లోని కర్మాండూలో చిక్కుకుపోయారు. గత వారం రోజుల కిందట తీర్థయాత్రలకని వారు అక్కడికి వెళ్లారు. ఈ లోపుగా నేపాల్‌లో పరిస్థితి మారిపోయింది. సామాజిక మాధ్యమాలపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన యువత ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. నేపాల్ అగ్నిగుండంగా మారింది. నిరసనకారులు దాడులు చేసి.. ఇళ్లకు నిప్పు పెట్టడంతో పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తమకు ఎటువంటి ఆహారం, సౌకర్యాలు లేవని గుమ్మలక్ష్మీపురం వాసి నెమలిపురి వెంకట్ వాపోయారు. ప్రస్తుతం ఆర్మీ సంరక్షణలో ఉన్నామని, ఆధార్ కార్డులు పరిశీలిస్తున్నారని తెలిపారు. త్వరలోనే కర్మాండూ ఎయిర్‌పోర్టుకు పంపిస్తామని చెబుతున్నారని వెల్లడించారు. ఇక్కడున్న పర్యాటకుల కోసం ఢిల్లీ నుంచి కర్మాండూకు ఐఏఎఫ్ విమానం వస్తున్నట్లు తాము ఉండే హోటల్‌కు భారత రాయబార కార్యాలయం నుంచి మెసేజ్ వచ్చిందని ఆయన తెలిపారు. మరోవైపు బుధవారం మంత్రి నారా లోకేశ్ ఫోన్ ద్వారా వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. జిల్లాకు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా ఈ విషయం తెలుసు కున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆయా మండలాల తహసీల్దార్లను అప్రమత్తం చేశారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఆ తర్వాత కర్మాండూలో ఉన్న మన్యం వాసులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాకు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఆటో డ్రైవర్లకు దసరా కానుక

- వాహనమిత్ర కింద రూ.15 వేలు జమ
- తీపి కబురు చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు



సాలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు తీపికబురు అందించింది. దసరా కానుకగా వాహనమిత్ర పథకం కింద రూ.15 వేల చొప్పున జమ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ సిక్స్, సూపర్ హిట్ వేదికపై ప్రకటించారు. దీంతో జిల్లాలో ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన్యంలోని 15 మండలాల్లో సుమారు 5,300 ఆటోలున్నాయి. 5వేల మందికి పైబడి ఉపాధి పొందుతున్నారు. కాగా పథకం అమలు, నమోదు ప్రక్రియపై రెండు రోజుల్లో ప్రభుత్వం విధివిధానాలు విడుదల చేయనుంది. 'సీఎం చంద్రబాబు వాహనమిత్ర పథకం ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆ డబ్బులతో ఆటో మరమ్మతు పనులు చేపడతాం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.' అని సాలూరుకు చెందిన ఆటో డ్రైవర్లు రెడ్డి శేఖర్, నల్లి మహేష్, దోనకొండ గౌరీశంకర్ తెలిపారు.

కొండెక్కిన కోడి ధర

6లో

- కిలో రూ. 260



నిర్భయంగా సమాచారం అందించండి

8లో

- రైతులతో విచారణ అధికారి రమణమూర్తి

బాక్స్ క్రికెట్ బస్తీల్లోనూ హిట్

6లో

- ఆసక్తి చూపుతున్న యువత
- ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఆటలు



అబ్బే.. అవి పనికిరావు!

- ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుపై చొరవ చూపని అధికారులు
- స్థల సేకరణ, కొనుగోలుకు ముందుకురాని వైనం
- రెవెన్యూ శాఖ చూపే భూములు పనికిరావంటూ నివేదికలు
- పరిశ్రమల శాఖ తీరుపై విమర్శలు
- ఇలా అయితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

పార్వతీపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్క్ ఏర్పాటు చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లా నిరుద్యోగ యువత ఎంతో సంబరపడ్డారు. పరిశ్రమలు ఏర్పాటైతే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని, పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదని భావించారు. అయితే జిల్లాలో పరిశ్రమల శాఖాధికారుల తీరు మాత్రం మరోలా ఉంది. ప్రభుత్వ లక్ష్యాన్ని కాగితాలకే పరిమితం చేసేవిధంగా ప్రయత్నిస్తోంది. జిల్లాలో పాలకొండ మినహా మిగతా నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఎంఎస్‌ఎంఈ పార్కులకు స్థలాలను ఖరారు చేయలేదు. భూముల కొనుగోలుకు, నష్టపరిహారం చెల్లింపులకు ముందుకు రాకపోగా, ఈ విషయంలో పరిశ్రమల శాఖ కుంటిసాకులు చెబుతూ.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఎంఎస్‌ఎంఈ పార్కుకోసం దత్తివలసలో గుర్తించిన స్థలం

ఇదీ పరిస్థితి..

- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేందుకు రెవెన్యూ శాఖ తనవంతు ప్రయత్నం చేస్తోంది. కానీ పరిశ్రమల శాఖ మాత్రం ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలం పనుకువలస మాత్రమే ఎంఎస్‌ఎంఈ పార్క్ సంబంధించి స్థలాన్ని ఖరారు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో స్థల సేకరణ చేయలేకపోయారు.
- సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం కొటికపెంట రెవెన్యూ పరిధి సరాయివలస సమీపంలో సర్వే నెంబరు 210లో 40 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు రెవెన్యూశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఆ భూమి అటవీశాఖకు చెందిందని పరిశ్రమల శాఖ చెబు తోంది. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం అది కొండ పోరం బోకుగా నమోదై ఉంది. మొత్తంగా ఆ ప్రాంతంలో పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు.
- కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం చిలకాం వద్ద దత్తివలసలో గ్రామంలో డీ పట్టా భూమిని రెవెన్యూ శాఖాధికారులు చూపించారు. అక్కడ ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ భూములు కొనుగోలు చేయలేమని పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు తేల్చేశారు.
- పార్వతీపురం నియోజకవర్గం చందలింగి గ్రామం వద్ద డీపట్టా భూములను రెవెన్యూ శాఖాధికారులు ఎంపిక చేశారు. అయితే నష్టపరిహారం చెల్లించేందుకు పరిశ్రమల శాఖ ముందుకు రావడం లేదు.

25 ఎకరాలు ఎక్కడ?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖాళీగా ఉన్న భూములను జగనన్న కాలనీలకు (మిగతా 8వ పేజీలో...)



కొటికిపెంట రెవెన్యూ పరిధిలో గుర్తించిన ప్రాంతం



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీ

పల్లెల్లో మూడో విడత రీ సర్వే

- జిల్లా సర్వేశాఖ ఏడీ లక్ష్మణరావు

గరుగుబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మూడో విడత భూముల రీసర్వే ప్రారంభించాలని జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూజారి లక్ష్మణరావు ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రీసర్వేపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. పెద్దూరు పంచాయతీ పరిధిలోని శివరాంపురం, కొత్తపల్లి గరుగుబిల్లి, తోటపల్లి గ్రామాల్లో రీసర్వే ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు గ్రామ హద్దులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రీసర్వే డీటీ మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. రక్తహీనత నివారణలో భాగంగా పౌష్టికాహారం అందించడంతో పాటు ఐసీడీఎస్, డీఆర్‌డీఏ ద్వారా అనేక చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ చెప్పారు. ముఖ్యంగా గర్భిణులకు 21 రకాలతో అదనపు కిట్లును పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎవరైనా రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలిస్తే.. సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామన్నారు. మహిళలు, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సీడీపీవో పరిధిలో ముగ్గురు సూపర్‌వైజర్లు, ఐదుగురు అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా ఐసీడీఎస్ విజయాలను అందరికీ తెలియజేయాలన్నారు.

కలెక్టరేట్‌లో కాల్ సెంటర్

జిల్లాలో యూరియా, ఎరువుల సమాచారం కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యాలయ పనివేళల్లో ఈ 08963 359853 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నాగావళికి వరద



తోటపల్లి స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి బుధవారం వరద పోటెత్తింది. పైప్రాంతం ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో నదిలోకి సుమారు 8 వేల క్యూసెక్కులు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్లు నుంచి దిగువ ప్రాంతాలకు 4 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. సాగునీటికి గాను ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.51 మీటర్ల మేర నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు బుధవారం తెలిపారు. ఇదిలాఉండగా జంఝావతి ప్రాజెక్టుకు 230 క్యూసెక్కులు, వట్టిగెడ్డకు 0.868, వీఆర్ఎస్‌కు 1,463 క్యూసెక్కుల వరద చేరింది.

మక్కువలో భారీ వర్షం

6లో

నేడు జేసీ బాధ్యతల స్వీకరణ

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలె క్టర్‌గా నియామకమైన యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు జేసీగా పనిచేసిన శోభికకు బదిలీ కావడంతో.. ఆ స్థానంలో యశ్వంత్‌కుమార్ రెడ్డి వస్తు న్నారు. కొద్దిరోజుల కిందట వరకు ఆయన పాలకొండ సబ్‌కలెక్టర్, సీతం పేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా పనిచేశారు.



మృతదేహాన్ని మోసుకుంటూ వాగు దాటుతున్న గిరిజనులు

అంత్యక్రియలకు అవస్థలు

- శ్మశానానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే..

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్యవలస గిరిజన ప్రజలు అంత్యక్రియలకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరు చనిపోయినా కిలోమీటరు దూరంలో ఉన్న వాగు దాటి శ్మశానానికి వెళ్లాల్సి వస్తోంది. వేసవిలో ఎటువంటి ఇబ్బంది లేకపోయినా వర్షాకాలంలో మాత్రం వాగులో నడుం లోతు నీటిని దాటాల్సిన దుస్థితి. ఈ గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళ (48) అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందింది. దీంతో ఆ ప్రాంత వాసులు మృతదేహాన్ని మోసుకుంటూ.. వాగును దాటి శ్మశానానికి చేరుకున్నారు. ప్రస్తుతం వాగులో నీరు ఎక్కువగా ఉండగా.. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, గ్రామానికి వాగుకు మధ్యలో శ్మశానానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని గిరిజనులు కోరుతున్నారు.

మా ప్రాంతంలో క్వారీ వద్దు

- అధికారులకు తేల్చి చెప్పిన గ్రామస్థులు

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం కారాడవలస- పెద్దబొండపల్లి గ్రామాల మధ్య క్వారీ ఏర్పాటు చేయొద్దని ఆ ప్రాంతవాసులు తేల్చి చెప్పారు. గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని నినదించారు. బుధవారం కారాడవలస సమీపంలో రెవెన్యూ, పర్యావరణ శాఖాధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు క్వారీ నిర్వహణకు అనుమతులిస్తే సహించేది లేదని ముక్తకంఠంతో తెలిపారు. గ్రానైట్ తవ్వకాలు చేపట్టే ప్రాంతం తమ గ్రామాలకు సమీపంలో ఉందని, గ్రామస్థులు అనారోగ్యం పాలవ్వడంతో పాటు మేతకు వెళ్లే మూగజీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందని వెల్లడించారు. పంటలను కూడా నష్టపోతామన్నారు. అనంతరం క్వారీ నిర్వహణ వద్దంటూ సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ప్రజల అభిప్రాయాన్ని ఉన్నతాధి కారులకు తెలియజేస్తామని డీఆర్వో హేమలత తెలిపారు. ఆమె వెంట రూరల్ ఎస్ఐ సంతోషి తదితరులు ఉన్నారు.



క్వారీ వద్దంటూ నినాదాలు చేస్తున్న రెండు గ్రామాల ప్రజలు

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ సూచించారు. బుధవారం సంతోషపురంలో ఆయన మాట్లాడుతూ.. 'ఖరీఫ్ వరికి మోతాదుకు మించి యూరియా వాడితే తెగుళ్లు అధికమవుతాయి. నానో యూరియాపై దృష్టి సారించాలి.. ప్రకృతి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించొచ్చు. జిల్లాలో 1192 టన్నుల డీఏపీ, 1279 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 670 టన్నుల పొటాష్, 888 టన్నుల సూపర్ ఫాస్ఫేట్, 1177 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి.' అని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

కౌశలం గుర్తించేందుకు..

6లో

- జోరుగా వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే
- నిరుద్యోగుల వివరాలు నమోదు

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

6లో

- ఉమ్మడి జిల్లా న్యాయాధికారి బబిత

రేపు డయల్ యువర్ డీపీటీవో

8లో

ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

బాక్స్ క్రికెట్.. బస్తీల్లోనూ హిట్

- ఆసక్తి చూపుతున్న యువత
- ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఆటలు

సాలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

బాక్స్ క్రికెట్... ఇటీవల ఎక్కువ మంది విద్యార్థులు, యువత నుంచి వినిపిస్తున్న మాట. ఒకప్పుడు వీధుల్లోనూ... ఎండిపోయిన చెరువుల్లోనూ... ఖాళీ స్థలాల్లోనూ... పాఠశాలల ఆవరణల్లోనూ... చిన్నాపెద్దా క్రికెట్ ఆడుతూ కనిపించేవారు. ఇప్పుడు రోజులు మారాయి. చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో సైతం ఖాళీ ప్రదేశాలు కనిపించడం లేదు. ఆటలకు చోటే ఉండడం లేదు. దీంతో ఒకప్పుడు మెట్రో పాలిటన్ నగరాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ ఇప్పుడు చిన్న పట్టణాలకు చేరువైంది. పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ఈ చిట్టి క్రీడా మైదానాలు కనిపిస్తున్నాయి. వీటిలో జోరుగా పోటీలు కూడా సాగుతున్నాయి.



సాలూరులో బాక్స్ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఉదయం నుంచి రాత్రి వరకు...

జిల్లాలో సాలూరు పట్టణంతో పాటు అనేక నగరాలు, పట్టణాల్లో, సాలూరు పట్టణంలో ప్రత్యేకించి బాక్స్‌లు వెలిశాయి. యువకులు అద్దె స్థలాల్లో పెట్టుబడులు పెట్టి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ప్రస్తుతం చాలా డిమాండ్ ఏర్పడింది. విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు టీములుగా ఏర్పడి ఇక్కడ ఆడుతున్నారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో ఇవి కిటకిటలాడుతున్నాయి. కొన్నిచోట్ల ఏకంగా ముందస్తు కేటాయింపులు నడుస్తుండడం విశేషం. ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఫ్లెడ్‌లైట్ల వెలుగుల్లో బాక్స్ మైదానాలు కేరింతలతో హోరెత్తుతున్నాయి. అర ఎకరా నుంచి 2 ఎకరాల విస్తీర్ణంలో ఈ చిట్టి క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మైదానం సిద్ధం చేయడానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు వెచ్చిస్తున్నారు. కొన్నిచోట్ల క్రికెట్‌తో పాటు వాలీబాల్, ఫుట్‌బాల్ కూడా ఆడుకునే సదుపాయం ఉంటోంది. వీటి వినియోగానికి గంటలు, రోజుల లెక్కన నిర్వాహకులు రుసుం వసూలు చేస్తున్నారు.



కుటుంబ సమేతంగా...

ఉద్యోగ, వ్యాపార ఒత్తిళ్లతో సతమతమవుతూ కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేని వారు ప్రస్తుత రోజుల్లో ఎంతో మంది ఉన్నారు. వీరిలో కొంతమంది వారాంతాల్లో కుటుంబాలతో గడపడానికి బాక్స్ క్రికెట్‌ను వేదికగా చేసుకుంటున్నారు. కొన్ని గంటల పాటు మైదానాలను అద్దెకు తీసుకొని కుటుంబాలతో సరదాగా గడుపుతున్నారు.

ఒత్తిడి తగ్గడానికి...

వారమంతా ఉద్యోగ విధుల్లో అలసిపోతాం. మానసికంగా చాలా ఒత్తిడికి గురవుతున్నాం. ఒత్తిడి తగ్గాలంటే ఏదో ఒక ఆటవిడుపు ఉండాల్సిందే. అందుకే డబ్బు వెచ్చించి బాక్స్ క్రికెట్‌కు వస్తున్నాను. సమయం దొరికినప్పుడు తప్పకుండా స్నేహితులతో ఆడుతున్నా. సాలూరు పట్టణంలో ఇలాంటి బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది.

-శ్రీనివాస్, బ్యాంకు ఉద్యోగి, సాలూరు

రాత్రి వేళ ఆడుకునేందుకు వీలుగా...

సాలూరులో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడం వల్ల రాత్రిపూట కూడా ఆడుకునే అవకాశం ఉంది. వర్షం కురిసినా, ఎండల్లో కూడా ఆడుకోవడానికి అనువుగా ఉంది. రోజంతా విధులు నిర్వహించి... రాత్రివేళ ఆడుకుంటాం. వారానికి నాలుగుసార్లు బాక్స్ క్రికెట్ ఆడుతుంటాను.

-రాజేష్, ఉద్యోగి, సాలూరు

టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎస్సార్ స్కూల్‌లో బుధవారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17కు బాలికల టేబుల్ టెన్నిస్, మాల్కంబ జట్లను ఎంపిక చేసినట్టు డిప్యూటీ డీఈవో కె.వెంకటరమణ తెలిపారు. ఈ ఎంపికలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు స్కూల్స్ గేమ్స్ ఉపయోగపడతాయని తెలిపారు. టేబుల్ టెన్నిస్ కార్యదర్శి కృష్ణమూర్తి, తవిటయ్య, రత్నకిషోర్, శ్రీను, రవి, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో డిప్యూటీ డీఈవో వెంకటరమణ

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా న్యాయాధికారి బబిత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూసి... విజయవంతం చేయాలని జిల్లా న్యాయాధికారి బబిత పిలుపునిచ్చారు. విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లోని న్యాయాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద బీమా కేసులు, బ్యాంకులు, చెక్కు బౌన్సు కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, విద్యుత్, ఎక్సైజ్ కేసులు, భూ సంబంధిత, మున్సిపాలిటీ, ప్రీలిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారమయ్యేలా చేయాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను పోలీసు అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్, న్యాయాధికారులు మీనాదేవి, ఎం.పద్మావతి, కె.నాగమణి, జి.దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌశలం గుర్తించేందుకు..

- జోరుగా వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే
- నిరుద్యోగుల వివరాలు నమోదు

గజపతినగరం/విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఈ క్రమంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా గతంలో 'కౌశలం' పేరుతో వర్క్ ఫ్రం హోమ్ సర్వేను చేపడుతోంది. జిల్లాలో నిరుద్యోగులు ఎంత మంది ఉన్నారు? ఎంతవరకు చదువుకున్నారు? ఎటువంటి ఉద్యోగానికి వెళ్లాలని అనుకుంటున్నారు? తదితర వివరాలను సర్వే బృందం సేకరిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ శాఖ సిబ్బంది సర్వేను వేగవంతం చేస్తున్నారు. సర్వే పూర్తి చేసి... నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. నిరుద్యోగుల వివరాలు సేకరించేలా పని విభజన చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగుల వివరాలు, సంబంధిత కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. ఐటీ సెక్టారులో ఉన్న వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి... నిరుద్యోగుల విద్యార్హతను బట్టి ఎటువంటి ఉద్యోగం కావాలని అనుకుంటున్నారో అడగడంతో పాటు శిక్షణ తీసుకుంటారా? అని వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారి విద్యార్హతల సమాచారంతో సచివాలయాలకు జాబితాలు చేరుకుంటున్నాయి. డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు ఉన్నత చదువులు పూర్తి చేసిన వారిలో గృహిణులూ ఉన్నారు. సచివాలయ సిబ్బంది వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. వేలిముద్ర, ఐరిస్ తీసుకుంటున్నారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రం హోమ్‌లో ఏ తరహా ఉద్యోగం కావాలో అడిగి నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందించే శిక్షణకు హాజరవుతారా? అని వివరాలు సేకరిస్తున్నారు. దీంతో నిరుద్యోగులు తమ భవిష్యత్తుకు భరోసా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





గజపతినగరం: మరుపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

పదో తరగతి నుంచి..

పదో తరగతి, ఇంటర్, డిప్లమో నుంచి పీజీ వరకూ చదివిన వారు కౌశలం సర్వేలో నమోదు చేసుకోవచ్చును. ఈ సర్వేలో పాల్గొన్న వారి అర్హతలను అనుసరించి ప్రభుత్వం నుంచి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రచిస్తోంది. దీని ద్వారా యువత ఆర్థికంగా ఎదగడానికి తోడ్పతుందని భావిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకోవడంతో పాటు... ఎవరికి వారు సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా..

హెచ్‌టీటీపీః//జీఎస్‌డబ్ల్యూఎస్-ఎన్‌బీఎం.ఏఎ.జీఓవీ.ఇన్/బీఎం/వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చును. అక్కడ కనిపించే విండోలో వర్క్‌ఫ్రమ్ హోం ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.

- ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు, ఈమెయిల్ వంటి వివరాలను నమోదు చేసి ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి.
- తరువాత అభ్యర్థుల విద్యార్హతలు, మార్కులు, చదివిన కళాశాల, గ్రూప్ వంటి వివరాలు పూర్తిగా నింపాలి.
- అత్యున్నత విద్యార్హతలకు సంబంధించిన మార్కుల జాబితాను (పది, ఇంటర్ చదివిన అభ్యర్థులు కాదు) అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 10,377 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. ఎవరికి వారు సొంతంగా 2,765 మంది దరఖాస్తు చేశారు.

కొండెక్కిన కోడి ధర

- కిలో రూ. 260



సాలూరులో విక్రయానికి ఉంచిన కోళ్లు

సాలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడి మాంసం ధర కొండెక్కింది. గత కొద్ది రోజులుగా కోడి మాంసం ధరలు పెరుగుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో లైవ్ కోడిని బుధవారం రూ.148కి విక్రయించారు. కోడి మాంసం కిలో రూ.260కు విక్రయించారు. ఇలా ధరలు పెరుగుతుండడంతో మాంస ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కిలో రూ.220 ఉండగా... ప్రస్తుతం కిలో రూ.260 వరకు విక్రయి స్తున్నారు. లైవ్ కోడి సైతం కిలో రూ.110 నుంచి రూ.120 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.148కి పెరగడంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పరిసర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరా తగ్గడంతో వ్యాపారులు రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాకు చేరుకునేటప్పటికి రవాణా ఖర్చులు అధికం కావడంతో మాంసం ధర పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

మక్కువలో భారీ వర్షం



మక్కువ ప్రధాన రహదారిపై వర్షపునీరు

మక్కువ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మక్కువలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు వర్షం కురవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే వ్యాపారులు తమ సరుకులు కాపాడుకొనేందుకు అవస్థలు పడ్డారు. స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహించింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు చాలాసేపు ఆటంకం కలిగింది.

పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నిమ్మక జయక్రిష్ణ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలతో...

అబ్బే.. అవి పనికిరావు!

(5వ పేజీ తరువాయి)

కేటాయించారు. దీంతో నియోజకవర్గాల్లో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కడా కానరావడం లేదు. దీంతో భూ సేకరణ ఎప్పుడు జరుగుతుంది.. ఎంఎస్ఎంఈ పార్కులు ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూమి లేనప్పుడు పరిశ్రమల శాఖాధికారులు భూములు కొనుగోలుకు ముందుకు వచ్చి.. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని మన్యంవాసులు కోరుతున్నారు.

భూములను చూపించాం

'రెవెన్యూశాఖ ద్వారా ఎంఎస్ఎంఈ పార్కులకు సంబంధించి తగు చర్యలు తీసుకుంటున్నాం. పాచిపెంట మండలంలో కొటికపెంట వద్ద భూమిని చూపించాం. ఆ ప్రాంతం అనుకూలంగా ఉండదని పరిశ్రమల శాఖాధికారులు చెబుతున్నారు. అదేవిధంగా చిలకాం, చందలంగి వద్ద అసైండ్ భూములు చూపించాం. వాటిని పరిశ్రమల శాఖ కొనుగోలు చేయాల్సి ఉంది. అసైన్డ్ భూములకు సంబంధించి పరిశ్రమలశాఖ డీ పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.' అని జిల్లా రెవెన్యూ అధికారి హేమలత తెలిపారు.

ద్వారపురెడ్డిని కలిసిన ముంజేటి

పాలకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావును బుధవారం బీజేపీ పాలకొండ పట్టణ అధ్యక్షుడు ముంజేటి ఉమామహేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఆయన్ని అభినందించారు.

ఆత్మహత్యా ప్రయత్నం నేరం

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య ప్రయత్నం నేరమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ వి.కల్పన అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా ఆమె మాట్లాడారు. తీవ్ర మానసిక వేదనలో ఉన్నప్పుడు ఆ బాధను వేరొకరితో పంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, శ్రీవాణి, తులసి, సత్యారావు, చిన్నారావు, జిమ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గరుగుబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల వారీగా ప్రచార సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. అలాగే స్వామిత్వ సర్వేను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

జియ్యమ్మవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిప్పల భద్రకు చెందిన అదృశ్యమైన బాలిక ఆచూకీని బుధవారం పోలీసులు కనుగొన్నారు. నెల్లూరు జిల్లా ఆకివీడు సమీపంలో గుమ్మలపాడు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 6న బాలిక అదృశ్యమైందని ఆమె తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన ఎస్ఐ అనీష్ అదృశ్యమైన బాలిక ఆచూకీ గుర్తించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సర్వే వేగవంతం చేయండి

మక్కువ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌశలం సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి



పాలకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలో గల షిర్డీసాయిబాబా సమేత సకల దేవాతాలయంలో కొలువుదీరిన విజయగణపతి స్వామికి బుధవారం ఘనంగా సంకటహర చతుర్థి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రధాన అర్చకులు శరత్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏజెన్సీలో ఆదికర్మ యోగి యోజన

జియ్యమ్మవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్నాడ పంచాయతీలోని బిల్లమానుగూడ, కొత్తగూడ గ్రామాల్లో బుధవారం ఆదికర్మ యోగివజనను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో సర్వే చేసి మౌలిక వసతులు, అవసరాలు గుర్తించారు. మండల మాస్టర్ ట్రైనీ అల్లు రవిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 అంశాలను గుర్తించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా సమాచారం అందించండి

● గరుగుబిల్లి పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగంపై రైతులను విచారించిన అధికారి



రైతుల నుంచి సమాచారం సేకరిస్తున్న విచారణాధికారి రమణమూర్తి

గరుగుబిల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని రైతులు నిర్భయంగా సమాచారం అందించాలని విచారణ అధికారి ఆర్.రమణమూర్తి కోరారు. బుధవారం గరుగుబిల్లి పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల నుంచి సమాచారాన్ని ఆయన సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పీఏసీఎస్‌లో సీఈవోగా విధులు నిర్వహించి మృతి చెందిన వ్యక్తి.. రైతులకు తప్పుడు రశీదులు అందించి కొంతమేర నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఉన్నతాధికారులు ధ్రువీకరించారన్నారు. దాంతో సంఘం పరిధిలో రుణాలు చెల్లించి రశీదులు పొందని వారు నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామ న్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు సుమారు రూ.90 లక్షలు పైబడి పక్కదారి పట్టినట్టు సమాచారం అందించారన్నారు. మొదటి విడతగా 31 మంది రైతులు నుంచి సమాచారం సేకరిస్తున్నామన్నారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా 15 మంది రైతుల నుంచి సమాచారం సేకరించామన్నారు. ప్రస్తుతానికి రూ. 49 లక్షలు మేర పక్కదారి పట్టినట్టు గుర్తించామన్నారు. సంఘం పరిధిలోని రెండు రశీదుల పుస్తకాలు అందుబాటులో లేవన్నారు. మొదటి పుస్తకంలో 112500 నుంచి 112550 వరకు, అలాగే రెండవ పుస్తకానికి సంబంధించి 112651 నుంచి 112700 వరకు మొత్తం 100 రశీదులు ఉంటాయన్నారు. ఈ రెండు పుస్తకాలకు చెందిన రశీదులు రైతులకు అందించి నగదు పుస్తకంలో నమోదు చేయలేదన్నారు. ప్రస్తుతం దళాయివలస, బీవీ పురం, వల్లరిగుడబ, చినగుడబ, ఉద్దవోలుకు చెందిన రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. రైతులు రుణాలు చెల్లించినట్లయితే విధిగా రశీదులు పొందాలన్నారు. సంఘం పరిధిలో మోసానికి గురైన రైతులు తగిన ఆధారాలతో హాజరుకావాలన్నారు. కొంతమంది రుణాలు తీసుకున్నట్లు లిఖిత పూర్వకంగా అందించారన్నారు. గరుగుబిల్లి పీఏసీఎస్ మల్టీపర్పస్ బ్యాంకు మాదిరిగా ఉండాల్సి ఉందని, జిల్లాస్థాయిలో గరుగుబిల్లి పీఏసీఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సిబ్బంది తీరు కారణంగా కొంతమేర సమస్యలు బారినపడిందన్నారు. డిసెంబరు చివరినాటికి విచారణ పూర్తి చేస్తామన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

భామిని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికచేస్తారు. ఎంచనున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు, ప్రిన్సిపాల్ బాబూరావు, మండల కో-ఆర్డినేటర్ జి.శివరామప్రసాద్, పీడీ, పీఈటీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

పాలకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాసూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జామి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు నెల్లి వెంకటరమణ, తెలుగు ఉపాధ్యాయుడు మొయ్యి రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

నారంశెట్టికి 'కార్యర్షి' పురస్కారం

బెలగాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు కార్యర్షి పురస్కారం వరించింది. ఈ నెల 7న హైదారాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలోని ఆడిటోరియంలో జరిగిన మహాకవుల జయంత్యుత్సవ సభలో మహాకవి కాళోజి స్మారక కార్యర్షి పురస్కారాలను వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు ప్రదానం చేశారు. బాల సాహిత్యంలో నారంశెట్టి చేసిన సేవలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డా.నందిని సిదారెడ్డి ఆధ్వర్యంలో నారంశెట్టికి పురస్కారం ప్రదానం చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

గరుగుబిల్లి/ సీతానగరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం రావివలస మీదుగా సారా తరలిస్తున్న చినమేరంగి గ్రామానికి చెందిన రాగోలు రత్నకుమార్‌ను ఈఎస్‌టీఎఫ్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం అరెస్టు చేశారు. మూడు క్యాన్లతో 60 లీటర్ల సారా ద్విచక్ర వాహనంపై ఒడిశా - ఆంధ్రా సరిహద్దు గ్రామం సందుబడి నుంచి జిల్లాలో గరుగుబిల్లి, వీరఘట్టం మండలాలకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నామని సీఐ తెలిపారు.

మద్యంతో నలుగురు..

కురుపాం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస, జియ్యమ్మవలస, సింగనాపురం,మూలిగూడ జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉపాధ్యాయ డిమాండ్లపై స్పందించాలి

సాలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యో): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీసాల వెంకట గౌరీశంకరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్ డీఏలు, ఆర్జిత సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటన, సీపీఎస్ రద్దు యాప్‌లు, అసెస్మెంట్ భారం తగ్గింపు తదితర వాటిని ప్రభుత్వం తీర్చాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి 17 వరకు ఉపాధ్యాయులు పోరాటపథంలో నడవాలన్నారు. ఈ నెల 11న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరుకావాలన్నారు. 12న మండల కేంద్రాల్లో, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడం, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన తెలియజేయాలన్నారు. ఈ నెల 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా వినతులు అందజేయాలన్నారు. కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు ప్రజల్లో భాగమేనని ప్రభుత్వం గుర్తించి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

పార్వతీపురం రేంజర్‌గా మణికంఠేష్



రేంజర్‌ను అభినందిస్తున్న అటవీశాఖాధికారులు

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రేంజర్‌గా మణికంఠేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన రామ్‌నరేష్ రామ్‌నరేష విజయనగరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మణికంఠేష్ మాట్లాడుతూ అటవీశాఖ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలను పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యమన్నారు. కార్య క్రమంలో అటవీశాఖ అధికారులు మనోజ్ తదితరులున్నారు.

డీపీఆర్‌వో రమేష్ సేవలు అభినందనీయం

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పనిచేసిన లోచర్ల రమేష్ సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కొనియాడారు. ఉప సంచాలకుడిగా పదోన్నతిని పొంది గుంటూరు బదిలీపై వెళుతున్న రమేష్‌ను కలెక్టర్ ఆయన చాంబర్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రమేష్ సేవలను కొనియాడారు. అలాగే, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయ అధికారులు, సిబ్బంది.. రమేష్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్య క్రమంలో ఇన్‌చార్జి జిల్లా సమాచార పౌర సబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ ఎం.గణపతిరావు, డివిజనల్ పౌర సంబంధాల అధికారి జీవి.రవికుమార్, సహాయ సమాచార ఇంజనీర్ సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ●జిల్లాలో డీపీఆర్‌వోగా సేవలందించిన రమేష్‌ను బుధవారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో స్నేహకళా సాహితీ వ్యవస్థాపకుడు జి.గౌరునాయుడు, సాహితీవేత్తలు పక్కి రవీంద్ర, ఎస్.స్వామినాయుడు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా అర్జునరావు

మక్కువ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎస్.అర్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

అభ్యాసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు శేషాద్రి

పాచిపెంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో అభ్యాసన సామర్థ్యాలపై బుధవారం జిల్లా విద్యా శిక్షణ సంస్థ అధ్యాపక బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాంచాళి జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ స్కూల్, స్థానిక కేజీబీవీలను బృందం పరిశీలించింది. ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్ అసిస్మెంట్ విధానం, అకడమిక్ క్యాలెండర్ పరిగణన, స్లోలెర్నర్స్ కోసం ప్రత్యేక శ్రద్ధ విషయం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. పాంచాళి హైస్కూల్‌లో బాలికల మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని వంట చెరకుతో తయారు చేయడంపై బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. పరిశీలనలో డైట్ అధ్యాపకులు సీహెచ్ శేషాద్రి సోమయాజులు, ఎన్.తిరుపతిరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మాట్లాడుతున్న సహాయ పథక సంచాలకుడు శ్రీహరిరావు

గరుగుబిల్లి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని పథక సహాయ సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరిరావు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఏడు రిజిస్టర్లను ఉపయోగించాలన్నారు. పనుల సమాచారాన్ని, వేతనదారుల వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే ఉద్యాన పంటలసాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఈశ్వరమ్మ, ఈసీ డి.తేజేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, పెద్దూరు గ్రామానికి చెందిన అల్లు సత్యనారాయణ, పైల జగదీశ్ అనారోగ్యానికి గురైన నేపథ్యంలో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. బుధవారం క్యాంప్ కార్యాలయంలో అల్లు సత్యనారాయణకు రూ.1,85,000, పైల జగదీశ్‌కు రూ.1,69,323 చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి మండల నాయకులు మరడాన తవిటినాయుడు, ముదిలిబాబు, నారాయణస్వామి నాయుడు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీపీటీవో

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై 12న డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 99592 25605 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన కోరారు.

14న రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

పాలకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఈ నెల 14న పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక జరగనుందని కబడ్డీ జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు, అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్న చంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులు 75 కేజీల లోపు, మహిళలు 65 కేజీల లోపు ఉండాలన్నారు. వయస్సు 1-1-2006 తర్వాత జన్మించి, 20 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 22 నుంచి 25 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రదేశానికి హాజరుకావాలన్నారు. వివరాలకు 9948066185, 9603305767 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం బుడగరాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.